# సంక్రాంతి అల్లుడు

## మధురాంతకం రాజారాం

ఋతువు లారింటిలోను నాకు హేమంత మంటేనే ఇష్టం. వసంతాన్ని తోసి రాజంటున్నానని అనుకోవద్దు. ఎండలు, ఉక్కపోతలు, చెమటలు, ఆపసోపాలు తప్పితే ఏముందండీ వసంతంలో? ఇక వర్ష, శరదృతువు లంటారా? రామ రామ, ఆ గాలీ వానా, రొంపీ రొచ్చూ తట్టుకో గలమా? హేమంతం సంగతి అలాకాదే! ఎండలుంటాయి. ఉంటేమాత్రం? యుక్త వయస్కుల మధుర దాంపత్యంలా అవి ఆహ్లాదకరంగా వుంటాయి. వాన లుంటాయి. ఉంటే వుండనీ! ఎదురు చూడని అతిథుల్లా వచ్చి అవి తిష్టా వెయ్యవు. ఇట్టే వచ్చి, అట్టే వెళ్లి పోతాయి. వాగుల్లో, వంకల్లో, చెరువుల్లో, దొరువుల్లో దండిగా నీళ్లుంటాయి. వెన్ను వదలిన చెరకు తోటల వైపు చూస్తే కాంతి బావుటాలు ఎగిరినట్లుంటాయి. పండిన వరిమళ్లు కోత కొస్తాయి. గాదులు, గరిసెలు కొత్త ధాన్యంతో సందడిస్తాయి. తోటల్లో, దొడ్లల్లో పాదులన్నీ తీగలు సాచి, పువ్వులు గుభాళిస్తాయి. తెల్లవారి లేచి చూసే సరికి అప్పుడే తానమాడి, ముఖం నిండుకు పచ్చి పసుపు రాసుకున్న నిండు ముత్తయిదువలా ప్రకృతి పరమ రమణీయంగా వుంటుంది. హేమంత మంటే నాకెందు కిష్టమో యిప్పుడు తెలిసింది గదండీ! లేదంటే మంచు వేపు కతింటుంది గదా, చలి రాచి రంపాన పెడుతుంది గదా అని మీరన వచ్చు. కానీ చలిమంట లుండగా, గాలి దూరని శయనా గారాలుండగా, వెచ్చని పరుపు లుండగా, రగ్గులు బూర్నీసులు వుండగా మంచును, చలిని ఎవరు లెక్క పెడతారండీ మీ పిచ్చిగానీ!

అందువల్ల మానవాళికి సుఖ సంతోషాలు పంచి పెట్టడానికే హేమంతం వస్తుందని నేననుకుంటాను. హేమంత ఋతు సీమంతిని పైరు పచ్చల నిగారింపులే పట్టు చీరగా వస్తుంది. మంచు బిందువులే ముత్యాల సరాలుగా వస్తుంది. ముదురు గుమ్మడి పువ్వే మణి కిరీటంగా వస్తుంది. గంగిరెద్దులవాడే అంగరక్షకుడుగా వస్తుంది. వచ్చి ఏం చేస్తుంది? గొబ్బిళ్ల దేవతై మన యింటి ముంగిట ముగ్గులో కొలువు దీరుస్తుంది. బంతుల్లై, చేమంతుల్లై మన పెరటి తోటలో విరగబూస్తుంది. ఇంతలో 'రంగలో రంగా హరి' అంటూ సాతాని జియ్యరు గంట మ్రోగిస్తాడు. 'హరహరా మహారాజేశ్వరా' అంటూ జంగమయ్య శంఖం పూరిస్తాడు. ఆగంట, ఈ శంఖం గూడా వినిపించే సరికి 'ఓహో, సంక్రాంతి గూడా వచ్చేస్తూ వుంది' అనుకుంటాం.

"ఏమండీ! అమ్మాయి, అల్లుడూ ఎప్పుడొస్తారు?" అంటుంది ఇంటావిడ.

అవును మరి! సంక్రాంతి సంబరాలన్నింటికీ పరాకాష్ఠ అల్లుడి ఆగమనమే! ఆపాటికి పెళ్లిళ్ల సీజను అయిపోయి వుంటుంది. ఈడొచ్చిన అమ్మాయిని ఎంత కాలమని యింట్లో వుంచుకుంటారు? ఆ శుభ కార్యమేదో అయిందని అనిపించి వుంటారు. ఆకాశమంత పందిరి గాక పోయినా అంతదో యింతదో షామియానా వేసి వుంటారు. గుర్రం అవుటాఫ్ డేట్ అయిపోయింది గనుక కారు కుదిర్చి వుంటారు. గుమ్మ తప్పెట్లకు, కొమ్ము బూరాలకు రోజులు కావు గనుక, బ్యాండు మేళం ఏర్పాటు చేసి వుంటారు. నాలుగు దినాల పెండ్లి ఊహించ రానిది గనుక ఒక భోజనంతో, ఒక టిఫినుతో సరిపెట్టి వుంటారు. పురోహితుడి పురమాయింపులకన్నా, ఫోటోగ్రాఫరు పోజులే చూపరులను లోగొని వుంటాయి. కాశీయాత్ర, అరంజ్యోతి దర్శనం, సూత్ర ధారణ, తలంబ్రాలు మొదలైన సాంగ్యాలు యథావిధిగా జరిగి పోయి వుంటాయి. ఉదయం తొమ్మిదింటి కల్లా సత్రం ఖాళీ అయి పోయి వుంటుంది. సాయంకాలానికి మీ అమ్మాయి అత్తారింట్లో కుడికాలు మోపి వుంటుంది. మూడు నిద్దర్లు చేసిన తర్వాత ఆమె భర్త సమేతంగా మీయింటి కొచ్చి వుంటుంది. వచ్చిన అల్లుడు నెలో, రెండు నెలలో మీ యింట్లో వుండి, హాయిగా మనుగుడుపులు ఆరగించడానికి అనువైన కాలమాయిది? పాపం, అతగాడు నూటికి తొంభై పాళ్లు ఎక్కడో ఉద్యోగై వుంటాడు. డ్యూటీకి వెళ్లక పోతే పై అధికారు లొప్పుకుంటారా? ఇంట్లో భార్యామణి ఎదుట గడగడలాడే ఆఫీసరైనా సరే, ఆఫీసులో మన సాప్ప కొత్తల్లుడికి సెలవు మంజూరు చేస్తాడా? మీ అల్లుడు వెళ్లే వుంటాడు. కొత్త సంవత్సరంలో కొత్త సెలవు లుంటాయి గనుక అదనంగా కొద్ది రోజులు సెలవు పెట్టి సంక్రాంతి కొస్తానని రాసి వుంటాడు. అదండీ సంగతి! సంక్రాంతి శోభలకు పరవశించి ప్రపంచమంతా ఆనంద నృత్యం చేస్తే చేయవచ్చు గాక! పండుగకు మీ అల్లుడొస్తే గానీ మీ కానందం లేదు.

ఆమాటకొస్తే అల్లుడికి మాత్రం అత్తవారింటికి మించిన ఆనంద ధామం ఎక్కడుంటుంది? పర్వతరాజ పుత్రికను వివాహమాడి పరమ శివుడేం చేశాడు? ఆ పర్వతాల్లోనే కాపురం పెట్టేశాడు. క్షీరసాగర కన్యను పెండ్లాడి విష్ణుదేవుడేం చేశాడు? ఆ సముద్రంలోనే నివ్వళించేశాడు. అందుకే [illegible] రంటారు–'ఏమయ్యా, కొత్త పెండ్లి కొడుకా! పండగొస్తోంది. వీలయినంత తొందరగా అత్తారింటికి వెళ్లు. అక్కడ నీ మరదలు పన్నీరు చిలికి నట్టుగా నీతో ముచ్చటాడుతుంది. పూల చెండ్లు విసరినట్లుగా బావ మరదులు సరాగాలు ఒలికిస్తారు. అత్తగారు మృష్టాన్నాలు వండి పెడుతుంది. ఓరచూపుల ఒయ్యారాలతోనే నవవధువు నిన్ను ఉయ్యాల లూపుతుంది' అని. నిజమే గదండీ! ఆత్మీయతలు, అభిమానాలు ఆఫీసులో దొరుకుతాయా? మర్యాదలు, మన్ననలు బస్‌స్టాండులో లభ్యమవుతాయా? సిగ్గులు, సింగారాలు మార్కెట్లులో ఎదురౌతాయా? ఇవన్నీ లభ్యమయ్యేచోటు ఒక టుండాలిగదా! అదే అత్తవారిల్లు.

అయితే ఒకటి. అల్లుడి కేదైతే అత్తగారిల్లో, అదే అమ్మాయికి పుట్టిల్లని మనం మరచి పోగూడదు. మెట్టినింట్లో అమ్మాయికి ఆదరణ లభించాలంటే, పుట్టింటి పునాది గట్టిగా వుండాలి. ఏదో ఒక అయ్య చేతికి పట్టిచ్చేశాము గదా అని ముభావంగా వుండి పోగూడదు. తరచుగా ఉత్తరాలు రాసి యోగక్షేమాలు తెలుసుకోవాలి. ప్రతి పండగకూ పిలవనంపాలి. మళ్లీ ఎందుకు లెమ్మని మొగమాట పడినాసరే, పరవాలేదు లెమ్మని చీరా, సారె పెట్టి పంపాలి. నెలలు నిండితే సీమంతం. తీర్థమాడితే బారసాల. ఇలా ఎంతో తతంగముంది..... పుట్టినింటి వారికి కనుపాపలా వుండాలి. మెట్టినింట్లో దీపమై వెలగాలి. ఇదే ఆడుబిడ్డ కోరుకోవలసిన భాగ్యం. దీన్నే 'సౌభాగ్యం' అంటారు.

ఇంతకూ చెప్పొచ్చిందేమిటంటే సంక్రాంతికి పుట్టింటికి వెళ్లాలన్న కోరిక ఆడుబిడ్డకు మరింత బలీయంగా వుంటుంది. మనిషి కోసం ఆమె వెయ్యి కళ్లతో నిరీక్షిస్తుంది. పిలుపు కోసం వెయ్యి చెవులతో వేచి వుంటుంది. ఆహ్వానం అందక పోతే ఆమె మనసు ఎంతగా నలిగిపోతుందో ఊహించుకో వలసిందే! 'ఏమమ్మా, పుట్టింటికి వెళ్లలేదా?' అని అమ్మలక్కలు ఆశ్చర్యపడి పోతారు. అత్తింటివారు చులకనగా చూస్తారు. భార్యను అలాంటి దమనీయ స్థితిలోనుంచీ తప్పించడం కోసం, మా చిట్టి బాబు ఒక అమోఘమైన ఉపాయం కనిపెట్టేశాడు, అది సంక్రాంతి శుభ సందర్భంలో తప్పకుండా చెప్పుకోవలసిన కథ.

చిట్టిబాబంటే ఎవరను కున్నారు? నా డియరెస్టు ఫ్రెండు. వాడి భార్య సుజాత. పాపం, సుజాతకు తల్లిదండ్రులు లేరు. బాబాయి పెళ్లి చేశాడు. పెళ్లి చేసే టంత వరకే తన బాధ్యత అనుకున్నాడు. మొదటి సంక్రాంతికే పిలుపు లేదు. రెండో సంక్రాంతి వచ్చేసరికి సుజాత ఒక బిడ్డ తల్లిగూడా అయింది. పండుగింక కొద్ది రోజుల్లోనే వుంది. సుజాత ముఖంలో చీకట్లు అలముకున్నాయి. చీకట్లను పోగొట్టి, ఆముఖంలోకి వెలుగులు తెప్పించాలను కున్నాడు చిట్టిబాబు. బాబాయి రాసినట్లు ఒక దొంగ ఉత్తరం రాసి పోస్టు చేశాడు. సుజాతకు

పుట్టింటి నుంచీ పిలుపొచ్చిందన్న వార్త వీధంతటా ప్రచారమై పోయింది పండుగకు ముందురోజే ప్రయాణం చంటివాణ్ని చంకలో వేసుకుని బయల్దేరింది సుజాత. చిట్టిబాబు సూట్‌కేసు చేత బట్టుకుని మగధీరుడిలా ముందు నడిచాడు

స్టేషనులోకి వెళ్లేదాకా పెదవి కదిపిన వాడు కాదు చిట్టిబాబు తీరా అక్కడికి చేరుకున్నాక మరింక ప్రమాదమేమీ లేదన్నట్టుగా తన కపట నాటకాన్ని బయట పెట్టేశాడు చిట్ట చివర 'మీ బాబాయి పిలిస్తే ఎంత, పిలవక పోతే ఎంత? పట్నంలో వసంత విహార్' అని ఒకటుంది అది మీ బాబాయి యింటి కన్నా నూరింతలు బాగుంటుంది. రోజు కేభైరూపాయలు పారేస్తే డబుల్ రూం దొరుకుతుంది టిఫిను, భోజనం, పాలూ పళ్ళూ, యిలా ఏది కావాలన్నా నేరుగా గదిలోకే వచ్చేస్తాయి. చూచావా సుజాతా' ఎంచక్కా యిక మీదట అదే నీకు పుట్టిల్లు నీకు పుట్టిల్లు గనుక అదే నాకు అత్తవారిల్లు " అంటూ చొక్కా కాలరు పైకెత్తాడట!

"ఏమండీ! ఇలాంటి పని చేసే వాళ్ళు కూడా వుంటారా ఎక్కడైనా?' అంటూ సుజాత నిర్ఘాంతపడిపోయిందట!

'ఉంటారుంటారు మన మున్నాం గదా!" తీవిగా ముసి ముసి నవ్వులు ఒలక బోస్తూ అన్నాడట చిట్టిబాబు

సరే, వాళ్ళలా వెళ్ళి వసంత విహార్‌లో దిగారనుకోండి! ఈలోగా యిక్కడేం జరిగిందంటే-

చిట్టిబాబు తల్లి, లక్ష్మీ సమానురాలైన శాంతమ్మ "ఏమండీ! పిల్లలు వెళ్ళిపోయాక యింట్లో ఏం తోచడం లేదండీ! మనమూ ఎలైనా వెళ్ళొద్దామండీ! నాకు పట్నం చూడాలని చాలా కాలంగా వుంది అబ్బాయి, కోడలు వచ్చేలోగా తిరిగొచ్చేద్దామండీ! అంటూ ముదిగారాలు మొదలెట్టిందట!

'సరే సరే అట్లాగే వెళ్దాంలే మరి' బయల్దేరు" అన్నారట జగన్నాథంగారు



# సం|క్రాంతి అల్లుడు

వృద్ధ దంపతులు రాత్రి తొమ్మిదింటికి పట్నంలో దిగారు ఆటోవాడు వాళ్ళని గూడా చక్కా వసంత విహార్‌కే తీసుకెళ్ళాడు అంత వరకూ జరిగింది కాకతాళీయమేనని అనుకోవచ్చు కానీ ఆ తర్వాత పడుచు జంటకు, ముసలి జంటకూ గూడా ఎదురెదురు గదులే కుదరడముంది చూచారా, అది మాత్రం కేవలం భగవత్సీలే అనాలి

అర్ధరాత్రి కాబోతుండగా కీచుకీచు మంటూ ఎదుటి గదిలో నుంచీ ఏడుపు వినిపించిందట!

ఉలికి పడి లేచి కూర్చున్న కాంతమ్మ భర్తను నిద్రలేపి, 'ఏమండీ' అది మన బుజ్జిబాబు ఏడుపులా లేదూ?" అంటూ ఆరాతీసిందట!

"లోకమంతా నీకు బుజ్జిబాబు మయమే?ఊరుకో, వూరుకో" అంటూ జగన్నాధంగారు గదమాయించేశారట!

మరికొంత సేపటికి చంటివాడి ఏడుపు శ్రుతిమీరి రాగాన పడిపోయిందట. వాడక్కడగుక్క తిప్పుకోకుండా ఏడుస్తుంటే యిక్కడ కాంతమ్మగారికి మతిపోయినట్టయి పోయిందట.

"ఏమండేమండీ! నిజంగా మన బుజ్జి బాబేనండీ! నిఝంగా మన బుజ్జిబాబు ఏడు పేనండీ!' అంటూ ఆమె తహతహలాడి పోయిందట

ఇంతలో ఎదుటి గది తలుపులు తెరుచుకున్న చప్పుడు వినిపించిందట తాళం కంతలో నుంచీ అవతలికి చూచిన కాంతమ్మ నోట మాట రాక నిర్విణ్ణురాలై పోయిందట తేరుకున్నాక భర్త దగ్గరికొచ్చి–

"ఏమండీ' మన వాళ్ళేనండీ' ఎంత పని చేశారో చూశారా' వీళ్ళింతకైనా తగుదురు హవ్వ. హవ్వ. అత్తారింటి కని చెప్పి చక్కావచ్చి హోటల్లో దిగుతారా? ఉండండి, వీళ్ళని .. " అంటూ కారాలు, మిరియాలు నూరడానికి ఉపక్రమించిందట.

అప్పుడు జగన్నాధంగారు భార్యను నింపాదిగా మంచంపైన కూచోబెట్టి "ఓసి, వెర్రి మొగమా! ఇంత వయసొచ్చి మనకే ఉబలాటాలు తప్ప లేదే! ఇక కుర్రవాళ్ళు, వాళ్ళకు సరదా కోరికలుండడం తప్పంటావా? చేసిన నిరవాకానికింక కోపతాపాలు కూడానా! చాల్చాల్లే తేలు కుట్టిన దొంగలా ఊరుకో!" అంటూ చెవిలో హితోపదేశం చేశారట.

కాంతమ్మ గారప్పుడు బుంగముఖం పెట్టి "పోనీలెండి! నేను వాళ్ళ నేమీ అనను ఏడ్చి ఏడ్చి బిడ్డకు శోష తగిలి పోయేటట్టుంది నేను వెళ్ళి వాణ్ణి ఊరుకో బెడతానండీ" అంటూ ప్రాధేయపడి పోయిందట.

ప్రాధేయపడడమే గాదు జగన్నాధంగారి మౌనాన్నే అంగీకారంగా భావించి ఆమె తలుపులు తీసుకుని తుఫానులా ఎదుటి గదిలోకి జొరబడి పోయిందట. "సముదాయించ డానికి తెలియని వాళ్ళు బిడ్డనెందుకు తెచ్చుకోవాలి? నాదగ్గరే విడిచి పెట్టిరావచ్చుగా'" అంటూ మనవణ్ణి అక్కున చేర్చుకుని చక్కా తన గదిలోకి తీసుకొచ్చేసిందట!

ఈ కథలో కొస మెరు పేమిటంటే – నాన్నమ్మ కనిపించిన తర్వాత అకుర్రకుంక కిముక్కుమంటూ నోరు తెరవలేదట నవ్వుకుంటూ, ఆడుకుంటూ ఆమె ప్రక్కన్నే అదమరిచి నిద్రపోయాడట!

సం|క్రాంతి అల్లుడికి ఎదురయ్యే అనుభవాలు వింతగా, వినోదంగా, చెప్పుకోదగ్గవిగా ఉంటా యనేందుకు చిట్టిబాబు కథ ఒక నిదర్శనం ఒక్కొక్కప్పుడు అవి కాస్త విడ్డూరంగా గూడా వుండొచ్చు. పనిలో పనిగా యింకొక రాజబాబు కథ అవధరించండి

పట్నంలో పుట్టి పెరిగిన శ్రీమంతుల బిడ్డ రాజబాబు. ఏరీ కోరీ ఎన్నిక చేసి పల్లెటూరి ఖామందు ముద్దుల కూతురు సావిత్రిని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళయిన కొత్తలోనే వచ్చింది సంక్రాంతి. దర్జాగా, పూలరంగడిలా అత్త వారిల్లు చేరుకున్నాడు రాజబాబు, అక్కడతనికి పగళ్ళు యుగాలుగాను, రాత్రులు క్షణాలు గానూ దొర్లి పోతున్నాయి. ప్రొద్దుపుట్టే దాకా పడుకోవడం పల్లెటూరి సాంప్రదాయాలకు విరుద్ధమని చెప్పి ఒకనాటి ఉదయం మసక మసక చీకట్లోనే సావిత్రి గదిలో నుంచీ వెళ్ళి పోయింది ఎంత బద్ధకంగా వున్నా లేవక తప్పదు గనుక రాజబాబు గూడా లేచి కాలవ గట్టుకు వెళ్ళాడు వెళ్ళి తిరిగొస్తుండగా తట్ట తలపైన పెట్టుకుని పొలాల వైపు వెళ్తున్న ఒక ముసలావిడ అదే పనిగా రాజబాబు ముఖంలోకి చూచి కిసుక్కున నవ్వేసింది. "ఏమిట్రాయిది! ఈ ముసలి దానికేం తెలుసు? మన ముఖంలో దీనికేం కనిపించింది?" అనుకుంటూ మరికొంత ధూరం నడిచాడు రాజబాబు. ఈ సారి మామగారి పాలేరే ఎదురయ్యాడు. బండి తోలుకెళ్తున్న ఆ పాలేరు పగ్గాలు బిగబట్టుకుంటూ ఎద్దుల్ని కాసేపు ఆపి, కొత్తల్లుడి ముఖంలోకి పరకాయించి చూచి, రాబోయిన నవ్వును బలవంతంగా ఆపుకుంటూ బండిని శరవేగంతో ముందుకు దూకించాడు.

'ఏమైందిరా బాబూ! మన ముఖమేమైనా మారిపోయిందా? నిన్నటి సాయంకాలం దాకా బాగానే వుందే!' అనుకుంటూ రాజబాబు మామగారి కాంపౌండులో ప్రవేశించాడు. పాలు నిండిన గుండు చెంబుతో పశువుల కొట్టంల్లోనుంచీ ఈ వలికొచ్చిన అత్తగారు, తటాలున అల్లుడి కెదురుపడి, ఒకక్షణం అలాగే నిలబడి పోయి, పెల్లుబికి రాబోయిన నవ్వును చీర చెరగులో దాచుకుంటూ తుర్రున యింటి వైపు సాగిపోయింది ఉక్రోషంతో యింట్లో అడుగు పెట్టిన రాజబాబు 'ఇదిగో సావిత్రీ! ఒకసారి యిలా వచ్చి వెళ్ళు' అంటూ హుకూం జారీ చేశాడు. ఆమె గదిలోకి రాగానే "ఏమిటి? ఏమైంది? మీ వూళ్ళో వాళ్ళ కందరికీ మూకుమ్మడిగా మతి భ్రమణం గానీ జరగలేదు కదా? నా ముఖంలో ఏముందని? ఎందుకలా నవ్వుతున్నారు?" అని గద్దించాడు

దగ్గరగా వెళ్ళి పతి దేవుడి ముఖాన్ని పరిశీలనగా చూచిన సావిత్రి ఉన్నట్టుండి తాను గూడా పకాలున నవ్వేసింది.

అప్పుడిక రాజబాబుకు నిలువుటద్దమే శరణ్యమైపోయింది

రాజబాబు అద్దం ముందుకు వెళ్ళి నిల్చున్నాడట! విషయ మేమిటో తెలియగానే అతడి పెదవుల పైకి సైతం ఒక చిరునవ్వు రాబోయిందట! సిగ్గుతో కాసేపు కుంచించుకు పోయి, ఆ తరువాత నాలుగంగల్లో బాత్‌రూంలోకి వెళ్ళి, సబ్బు పెట్టి ముఖాన్ని శుభ్రంగా కడిగేసు కున్నాడట!

రాజబాబు ముఖం చూచిన వాళ్ళందరూ ఎందుకు నవ్వారు? అందులో వాళ్ళకేం కనిపించింది?– అని మీరడగొచ్చు. అమ్మో, ఎంతాశ! అలాంటి విషయాలు చెబుతారటండీ ఎవరైనా! కథకు సస్పెన్సే గదండీ ప్రాణం! రసజ్ఞులైన యువ దంపతులు, అనుభవజ్ఞులైన ప్రౌఢ దంపతులు ఎవరికి వారే ఊహించు కొందురు గాక! మకర సంక్రాంతి మహాలక్ష్మి ఎవరికి కావలసిన ఆనందాలు వారికి పంచి పెట్టును గాకా లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు. ఓం శాంతి శ్శాంతి శాంతిః. □

